కొత్త పింఛన్లకు మోక్షం ఎన్నడో..!

- ఆరు నెలలైనా తెరుచుకోని ప్రభుత్వ సైట్
- సచివాలయాల చుట్టూ తిరుగుతున్న అర్హులు
- గత ప్రభుత్వంలో రేషన్‌కార్డులు, పింఛనులు నిరంతర ప్రక్రియ
- రెవెన్యూ సదస్సుల్లో పింఛన్‌లకు 359, రేషన్ కార్డులకు 1,678 అర్జీలు


ధూళ్ళిపాళ్ల గ్రామ సచివాలయం

సత్తెనపల్లి: దారిద్ర్యరేఖకు దిగువున ఉన్న వృద్ధులు.. భర్త చనిపోయిన వితంతువులు.. నడవలేని దివ్యాంగులు .. ప్రభుత్వం మంజూరు చేసే సామాజిక పింఛన్ల కోసం సచివాలయాలు చుట్టూ తిరుగుతున్నారు. అయితే కొత్త పింఛన్లు ఇంకా ఇవ్వడం లేదని, మళ్లీ రావాలని సచివాలయ ఉద్యోగులు చెబుతుండడంతో అర్హులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో పింఛన్లు, రేషన్‌కార్డుల దరఖాస్తు ప్రక్రియ నిరంతరం కొనసాగేదని, కానీ నేడు ఆ పరిస్థితి లేకుండా ప్రస్తుత ప్రభుత్వం సైట్ ఓపెన్ చేయకుండా కాలయాపన చేస్తోంది. కొత్త పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునే క్రమంలో నిత్యం సచివాలయాలు చుట్టూ తిరగలేకపోతున్నామని ప్రజానీకం చెబుతున్నారు. అంతేకాకుండా కొత్తగా వివాహాలైన వారు రేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకునేందుకు కూడా ప్రభుత్వం ఎప్పుడు కరుణిస్తుందా అని ఎదురుచూపులు చూస్తున్నారు.

ఎన్నికల నోటిఫికేషన్‌తో సైట్ బ్రేక్..?

గత ఏడాది ఏప్రిల్ 18 నుంచి ఎన్నికల నోటిఫికేషన్‌తో బ్రేక్ పడిన సైట్ ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు కావస్తున్నా ఇంకా ఓపెన్ చేయకపోవడం ఏమిటని ప్రజలు సచివాలయాలకు వెళ్లి అడుగుతున్నారు. గత జూన్ 12న కొత్త ప్రభుత్వం ఏర్పడినప్పటికీ ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదంటూ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పింఛన్లు తీసుకునేందుకు 60 ఏళ్లు నిండిన వృద్ధులు, దివ్యాంగులు, భర్త చనిపోయిన వితంతువులతో పాటు కొత్తగా వివాహాలు చేసుకున్న వారు కొత్త రేషన్ కార్డుల కోసం ఇలా ఎందరో ప్రభుత్వం సైట్‌కు ఎప్పుడు అనుమతిస్తుందా అని ఎదురు చూస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తే భూ సమస్యల కంటే రేషన్ కార్డులు, పింఛన్ల కోసం ఎక్కువగా అర్జీలు అందాయి. కేవలం ఒక్క సత్తెనపల్లి రూరల్ మండలంలోనే పింఛన్ల కోసం 359 మంది, రేషన్ కార్డుల కోసం 1,678 మంది అర్జీలు అందించారు. ఇంకా అర్హులు అర్జీలు అందించే సంఖ్య చాలా వరకు పెరిగే అవకాశాలు ఉన్నాయి.

గత ప్రభుత్వంలో సులభ మార్గం..

గత ప్రభుత్వ హయాంలో వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేయడంతో వారు ఇంటి వద్దకు వచ్చి అర్హులను గుర్తించి వారే దరఖాస్తు చేసి పింఛన్లు, రేషన్ కార్డులు ఇచ్చే సౌకర్యం అందుబాటులో ఉండేది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కొత్త పింఛన్లు, రేషన్ కార్డుల దరఖాస్తుకు అవకాశం ఇవ్వకపోవడంతో అర్హులైన ప్రజలు ఎదురు చూస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి అర్హులైన వారికి పింఛన్లు, రేషన్ కార్డులు మంజూరు చేసే దిశగా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మొక్కుబడి సదస్సులు


అచ్చంపేటలో జరిగిన రెవెన్యూ సదస్సులో జనంలేక దర్శనమిస్తున్న ఖాళీ కుర్చీలు

- ముగిసిన రెవెన్యూ సదస్సులు
- దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం చూపనివైనం
- అంతంతమాత్రంగానే ప్రజా స్పందన

అచ్చంపేట: రెవెన్యూ సదస్సులకు ప్రజా స్పందన కరువైంది. ఏ సభలో చూసినా ఎక్కువభాగం ఖాళీ కుర్చీలే దర్శనమిచ్చాయి. రెవెన్యూ సిబ్బంది తప్ప సభలలో ప్రజలు సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. కొన్నిచోట్ల సచివాలయ సిబ్బందితో కుర్చీలు నింపే ప్రయత్నం చేశారు. గత నెల 6వ తేదీ నుంచి ప్రారంభమైన రెవెన్యూ సదస్సులు బుధవారం కొండూరులో జరిగిన రెవెన్యూ సదస్సుతో ముగిశాయి.

18 గ్రామాల్లో 213 అర్జీలు..

18 గ్రామాలలో రెవెన్యూ సదస్సులు జరగ్గా మొత్తం 213 అర్జీలు మాత్రమే వచ్చాయి. నామమాత్రపు సమస్యలు మినహా దీర్ఘకాలిక సమస్యలు అలాగే ఉన్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా అగ్రహారం భూములపై తమకు హక్కులు కల్పించాలని మాదిపాడు, కోగంటివారిపాలెం గ్రామాల రైతులు అర్జీలు ఇచ్చారు. చెరుకుంపాలెం, కొత్తపల్లి గ్రామాలలో ఎప్పటినుంచో సాగుచేసుకుంటున్న భూములను రెవెన్యూ, అటవీశాఖాధికారులు జాయింట్ సర్వే చేపట్టి భూములపై హక్కులు కల్పించాలని కోరారు. ఆ దరఖాస్తులన్నీ పెండింగ్‌లోనే ఉన్నాయి. ఆన్‌లైన్ నమోదుల కోసం 103 అర్జీలు రాగా కేవలం 35 అర్జీలనే పరిష్కరించారు. ఇంకా 68 పెండింగ్‌లో ఉన్నాయి. 22–ఏ నిషేధిత జాబితా నుంచి తమ భూములను తొలగించమని ముగ్గురు దరఖాస్తు చేసుకోగా ఒక్కటి మాత్రమే పరిష్కరించారు. మొత్తం 18 గ్రామాలలో రెవెన్యూ సదస్సులలో 213అర్జీలు రాగా ఇంకా 85 సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదు. వాటన్నింటిని పెండింగ్‌లోనే ఉంచారు.

దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారమేదీ?

ఇంటినివేశన స్థలాలు, కుల ధ్రువీకరణ సర్టిఫికెట్స్, పుట్టినతేదీ ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడం వల్ల పరిష్కారమైన అర్జీల సంఖ్య పెరుగుతుందే తప్ప దీర్ఘకాలంగా ఉన్న సమస్యలు అలానే ఉన్నాయని అర్జీదారులే చెబుతున్నారు. కులం, బర్త్, నివేశన స్థలాల ఇవన్నీ నిరంతరం గ్రామ సచివాలయాలలో అర్హతనుబట్టి ఇస్తున్నవే.. వీటికి సదస్సులు అవసరం లేదని పలువురు విమర్శిస్తున్నారు. ఏది ఏమైనా మండలంలోని అన్ని గ్రామసచివాలయాల పరిధిలో జరిగిన రెవెన్యూ సదస్సులు ఒక విహార యాత్రలా ముగిశాయని ప్రజలు వ్యాఖ్యానిస్తున్నారు.

పూడికతీత పనులకు శంకుస్థాపన



సత్తెనపల్లి: మండలంలోని కంటిపూడి గ్రామ సమీపంలో లింగంగుంట్ల మేజర్ కాలువ పూడికతీత పనులకు ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ బుధవారం భూమి పూజ చేశారు. రూ.4.98 లక్షలతో ఎనిమిది కిలోమీటర్లు పొడవున పూడికతీత పనులు జరగనున్నాయి. ఎన్ఎస్‌జేసీ ఈఈ మురళీధర్, టీడీపీ నాయకులు దరువూరి.నాగేశ్వరరావు, యెల్లినేడి రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

రేపు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం


బెల్లంకొండ: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 10న నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వై.హనుమారెడ్డి బుధవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఈ సమావేశంలో ఉపాధి హామీ పథకం పై సమీక్ష, వివిధ సంక్షేమ కార్యక్రమాలు, శాఖల ప్రగతి తదితర విషయాలను చర్చించనున్నట్లు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

పలు గ్రామాల్లో హెల్త్ పెన్షన్ల సర్వే



బెల్లంకొండ: ప్రభుత్వం నుంచి హెల్త్ పింఛన్లు అందుకుంటున్న పెన్షన్ దారులను బుధవారం సర్వే బృందాలు పరిశీలించారు. మండలంలోని పాపాయపాలెం, మన్నెసుల్తాన్‌పాలెం, చంద్రాజుపాలెం, న్యూ చిట్యాల, బెల్లంకొండ, నాగిరెడ్డిపాలెం గ్రామాలలో వైద్య అధికారులు, వెలుగు అధికారులు బృందాలుగా ఏర్పడి పింఛనుదారుల ఇళ్లకు వెళ్లి సర్వే నిర్వహించారు. పెన్షన్ దారుల మెడికల్ రిపోర్టులు, ధ్రువపత్రాలను బృందం సభ్యులు పరిశీలించారు. సర్వే ద్వారా సేకరించిన ఆధారాలతో నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు. పీహెచ్‌సీ వైద్యాధికారి కేవీ కోటేశ్వరరావు, వెలుగు ఏపీఎం ఉషశ్రీ, సిబ్బంది పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు



బొల్లాపల్లి : ప్రాథమిక ఆరోగ్య కేంద్రా న్ని జిల్లా వైద్యాధికారి బి. రవి బుధవారం సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. వైద్యాధికారులు, సిబ్బందితో పీహెచ్‌సీలోని సమస్యలపై ఆరా తీశారు. జిల్లా వైద్యాధికారి మాట్లాడుతూ ఫిర్యాదు మేరకు పీహెచ్‌సీని సందర్శించి తనిఖీ చేయడం జరిగిందన్నారు. సిబ్బంది విధి నిర్వహణలో అలసత్వం, నీటి సౌకర్యం లేకపోవడం వంటి సమస్యలను పరిశీలించినట్లు తెలిపారు. వైద్యులకు, సిబ్బందికి విధి నిర్వహణ గురించి దిశ నిర్దేశం చేసి నీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారి పి. శంకర నారాయణ, వైద్యులు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'


నార్నెపాడులో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఏఓ అరుణ

నార్నెపాడు(ముప్పాళ్ళ): మొక్కజొన్న పైరు ప్రస్తుతం 40–50 రోజుల దశలో ఉందని, కత్తెర పురుగు గమనించినట్లయితే వెంటనే నివారణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ చెప్పారు. మండలంలోని నార్నెపాడు, పలుదేవర్లపాడు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఏఓ ఎం.అరుణ పాల్గొని కత్తెరపురుగు గుర్తించినట్లయితే ఈమామెక్టిన్ బెంజోయేట్ 80గ్రాములు లేదా థయోమెథాక్సైమ్ పురుగుమందును పైపాటుగా పిచికారీ చేసుకున్నట్లయితే పురుగును సమర్థవంతంగా నివారించుకోవచ్చన్నారు. కాండం తొలిచే పురుగు నివారణ కొరకు కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు ఎకరానికి 4కేజీల చొప్పున మొవ్వలో వేసుకోవాలని సూచించారు. వరి సాగు చేసిన రైతు ఎకరాకు రూ.630లు చెల్లించి బీమా చేయించుకోవాలన్నారు. ఈ నెల 15వ తేదీ వరకు ప్రీమియం చెల్లించవచ్చన్నారు. కార్యక్రమంలో వ్యవసాయవిస్తరణాధికారి, రైతులు పాల్గొన్నారు.

కస్తలలో...

అచ్చంపేట: ప్రస్తుతం మొక్కజొన్న పంట 30 నుంచి 50 రోజుల దశలో ఉందని, ఈ పరిస్థితులలో మొక్కపై కాండంతొలచే పురుగుల ప్రభావం ఎక్కువగా ఉంటుందని, ప్రారంభదశలోనే వాటిని నివారించాలని ఏఓ పి.వెంకటేశ్వర్లు తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని కస్తల గ్రామంలో బుధవారం ఆయన మిర్చి, మొక్కజొన్న, శనగ పంటలను పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడి పంట దిగుబడులపై పలు సూచనలిచ్చారు. వ్యవసాయ సిబ్బంది హర్ష, రహీం, రైతులు పాల్గొన్నారు.

టమాటాలో పూత రాలటం నివారించండి..

అమరావతి: మండల పరిధిలోని గ్రామాలలో ప్రత్యామ్నాయ పంటగా టమాటా సాగుచేసిన రైతులు ప్రస్తుతం పూత, పిందెల పైనున్న టమాటా పైరు నుంచి పూత రాలకుండా నివారించటం ప్రధానమని మండల ఉద్యానవనశాఖాధికారి శ్రీ నిత్య అన్నారు. బుధవారం ఆమె రైతులకు సూచనలిస్తూ ఏపుగా పెరిగిన టమాటా మొక్కలకు ఆధారంగా 9 నుంచి 12 అంగుళాల ఎత్తులో కర్రలు కట్టి కొమ్మలకు ఆధారం కల్పించాలన్నారు. పూతా, పిందె సమయంలో 20మి.లీ గ్రాముల ఫారాక్లోరోఫెనాక్సీ, అసిటిక్ ఆమ్లం లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయటం వల్ల పూత, పిందె నిలబడి కాపు పెరుగుతుందన్నారు. అలాగే కాయతొలుచు పురుగుకు కార్బారిల్ 3 గ్రాములు, ఎండోసల్ఫాన్ 2 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసినట్లయితే కాయతొలుచు పురుగులను నివారించవచ్చునన్నారు.

ఈకేవైసీ నమోదు చేసుకోవాలి..

నకరికల్లు: రబీలో సాగుచేస్తున్న పంటలకు ఈకేవైసీ నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు రైతులకు సూచించారు. మండలంలోని నర్సింగపాడు, త్రిపురాపురం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఆయా గ్రామాల్లో ఏఓ మాట్లాడుతూ ప్రధాన మంత్రి ఫసల్‌బీమా యోజన పథకం కింద ఎకరా పంటకు రూ42వేల బీమా నిర్ణయించినట్లు తెలిపారు. ఎకరాకు రూ630లు చొప్పున ప్రీమియం చెల్లించి జనవరి 15వ తేదీలోగా క్రాప్ ఇన్స్యూరెన్స్‌కు నమోదు చేసుకోవాలని సూచించారు. వ్యవసాయ సహాయకులు ఎం.డి.జాన్‌అహ్మద్, రైతులు పాల్గొన్నారు.

పొగాకులో సస్యరక్షణ తీసుకోవాలి..

బెల్లంకొండ: పొగాకు సాగు చేపట్టిన రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి డి.కృష్ణయ్య తెలిపారు. బుధవారం మండలంలోని కందిపాడు, చంద్రాజుపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న పొగాకు, వరి నారుమడలు, కంది పంటలను పరిశీలించారు. పొగాకు పైరులో కలుపు మొక్కలు లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని సూచించారు. వీఏఏలు రజిని, ప్రసాదరావు, రైతులు పాల్గొన్నారు.

జ్వర పీడితులు పరీక్షలు చేయించుకోండి

జిల్లా మలేరియా అధికారి ఒ.రవీంద్ర రత్నాకర్


మండెపూడి ఆరోగ్య ఉపకేంద్రంలో రికార్డులు తనిఖీ చేస్తున్న రవీంద్ర రత్నాకర్

అమరావతి: అత్తలూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మండల పరిధిలోని మండెపూడి గ్రామ ఆరోగ్య ఉప కేంద్రంలో బుధవారం పల్నాడు జిల్లా మలేరియా అధికారి ఒ.రవీంద్ర రత్నాకర్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన కీటకజనిత వ్యాధులపై అవగాహనా కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి మాట్లాడుతూ దోమలు పుట్టకుండా, గుడ్లు పెట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. గ్రామంలో జ్వరంతో బాధపడేవారు వెంటనే ఉపకేంద్రంలో రక్త పరీక్షలు ఉచితంగా చేయించుకోవచ్చునన్నారు. రోగులకు వ్యాధి నిర్ధారణ అయితే ఉచితంగా మందులు సంబంధిత ఉపకేంద్రం సిబ్బంది ఇస్తారన్నారు. గ్రామంలో ప్రతి శుక్రవారం వైద్య సిబ్బంది డ్రైడే కార్యక్రమం నిర్వహించాలన్నారు. యూనిట్ అధికారి సుభాన్ బేగ్, ఆరోగ్య విస్తరణ అధికారి లక్ష్మమనోహర్, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు కనీస వేతనం వచ్చేలా చర్యలు

నీటియాజమాన్య సంస్థ పీడీ సిద్ధలింగమూర్తి


మాట్లాడుతున్న పీడీ సిద్ధలింగమూర్తి


క్రోసూరు: ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లు ఉపాధి పనుల్లో కూలీలకు కనీసం వేతనం పడేలాగా బాధ్యతలు తీసుకోవాలని నీటి యాజమాన్య సంస్థ పీడీ ఎం.సిద్ధలింగమూర్తి అన్నారు. బుధవారం క్రోసూరు ఎంపీడీఓ కార్యాలయంలో నూతనంగా ఎంపికైన 44 మంది ఫీల్ అసిస్టెంట్లకు జరిగిన శిక్షణా కార్యక్రమంలో పీడీ పాల్గొని మాట్లాడారు. ఎంపీడీఓ జి.శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఈసందర్భగా పీడీ మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్లందరూ వచ్చే ఆరు మాసాలకు గ్రామ పంచాయతీల్లో శ్రమశక్తిసంఘాలు ఏర్పాటు చేసుకుని, కొలతలు, నిబంధనలు పాటించి తప్పని సరిగా నాణ్యమైన పనులు చేపట్టి కనీస వేతనం వచ్చేలాగా బాధ్యత తీసుకోవాలని కోరారు. ఏపీడీ పీవీ నారాయణ మాట్లాడారు. డీఆర్పీ వెంకటస్వామి, సీసీ రమణమూర్తి, ఏపీఓ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రాజుపాలెంలో..

రాజుపాలెం: ఉపాధి హామీలో పనిచేసే కూలీలకు కొలతలను బట్టి రోజుకు రూ.300లకు తగ్గకుండా వేతనం వచ్చేవిధంగా పని చేయించాలని నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.సిద్ధలింగమూర్తి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో సత్తెనపల్లి నియోజక వర్గ పరిధిలోని నాలుగు మండలాలకు సంభందించిన ఫీల్డ్ అసిస్టెంట్లకు, క్షేత్ర సహాయకులకు ఉపాధి పనులపై శిక్షణ బుధవారం జరిగింది. కార్యక్రమంలో ఎంపీడీఓ జీవీ సత్యనారాయణ, ఏపీడీ పొత్తూరి వెంకటనారాయణ, డీఆర్‌పీఎస్ ఏపీఓ ఏడుకొండలు, పి.వెంకటేశ్వరరావు, టీఏ చిరంజీవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది మారినా.. బోర్డుపై పాత పేర్లే..!

వెలుగు కార్యాలయంలో పాత సిబ్బంది పేర్లతోనే బోర్డు


వెలుగు కార్యాలయంలో పాత సిబ్బంది పేర్లతో దర్శనమిస్తున్న బోర్డు

క్రోసూరు: క్రోసూరు వెలుగు కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బంది మూడు నెలల క్రితం బదిలీ అయ్యారు. వారి స్థానంలో నూతన సిబ్బంది వచ్చారు. అయినా కార్యాలయంలో బోర్డు మాత్రం ఇప్పటికీ మార్చలేదు. వెలుగు కార్యాలయంలో ఏపీఎం, ఐదుగురు సీసీలు పనిచేస్తుంటారు. వీరిలో ఒక్క సీసీ మినహా ఏపీఎంతో సహా నలుగురు సీసీలు బదిలీ అయ్యారు. అదేవిధంగా బీమా మిత్ర, కల్యాణ మిత్రకు సంబంధించిన సిబ్బంది ప్రస్తుతానికి అసలు లేరని తెలిసింది. కానీ బోర్డుపై పేర్లు మాత్రం మార్చలేదు. వివిధ పనులపై కార్యాలయానికి వచ్చే మహిళలు, ప్రజలు తికమక పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వెలుగు కార్యాలయంలో బోర్డు సరిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

వైభవంగా శ్రీవారికి ధనుర్మాస పూజలు


ఆలయంలో గ్రామోత్సవంలో శ్రీవారు


సత్తెనపల్లిలో శ్రీవారి ఎదుట దీపోత్సవం

సత్తెనపల్లి: ధనుర్మాసాన్ని పురస్కరించుకొని పట్టణంలోని శ్రీవారి ఆలయాల్లో భక్తులు భక్తిశ్రద్ధలతో వైభవంగా పూజలు నిర్వహిస్తున్నారు. పట్టణంలోని రైల్వేస్టేషన్‌రోడ్‌లో గల అలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి వారి దేవాలయంలో బుధవారం దీపోత్సవం వైభవంగా నిర్వహించారు. శ్రీవారిని పద్మపీఠ మనోహర మూర్తిగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం శ్రీవారి గ్రామోత్సవం నిర్వహించారు. దీపోత్సవంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారికి విశేష హారతులు అందించారు. ప్రధాన అర్చకుడు చిత్రకవి శ్యామ్‌దాసన్ పూజలు నిర్వహించారు.

వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యుడికి సత్కారం


రామ్మోహన్‌రావును సత్కరిస్తున్న జ్యుయలరీ మర్చంట్ అసోసియేషన్ బాధ్యులు

సత్తెనపల్లి: పట్టణంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యుడిగా పదవీ ప్రమాణ స్వీకారం చేసిన ప్రముఖ వ్యాపారవేత్త, జ్యుయలరి మర్చంట్స్ అసోసియేషన్ కోశాధికారి జవ్వాజి రామ్మోహనరావును బుధవారం జ్యుయలరీ మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. అసోసియేషన్ అధ్యక్షుడు దేసు హరనాథ్‌బాబు, సెక్రటరీ యేలూరి పద్మాకర మురళీకృష్ణ, వైస్ ప్రెసిడెంట్ తూనుగుంట్ల కాశీ విశ్వనాథం, జాయింట్ సెక్రెటరీ దేవరశెట్టి రవికుమార్‌లు సత్కరించి భవిష్యత్తులో మరెన్నో పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు. జ్యూయలరీ వ్యాపారులు త్రిపురమల్లు పెదబ్రహ్మం, తూనుగుంట్ల ఉమామహేశ్వరరావు, కూనాగు చంద్రశేఖర్, చలం, చందలూరి రంగారావు, దేసు సోమశేఖర్, చక్కా కేశవ, కిలాన రామకృష్ణ, మట్టా దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

బొల్లాపల్లి : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఈపూరు మండలం కొండ్రముట్ల పంచాయతీ శివారు దుస్మాన్‌పేట వద్ద బుధవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. బొల్లాపల్లి మండలం మూగచింతలపాలెం రైస్‌మిల్లు కాలనీకి చెందిన కడియం బాలయ్య (42) రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. బాలయ్య వినుకొండ నుంచి స్వగ్రామమైన మూగచింతలపాలెంకు ద్విచక్రవాహనంపై వెళ్తూ మాచర్ల నుంచి వినుకొండ వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో బాలయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య మరియమ్మ, ముగ్గురు సంతానం కలరు. బండ్లమోటు ఎస్ఐ ఎ.బాలకృష్ణ, ఈపూరు ఏఎస్ఐ సాంబయ్యలు భార్య మరియమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఇదిలా ఉంటే బస్సుని రెగ్యులర్ డ్రైవర్ కాకుండా ఓ ప్రైవేటు వ్యక్తి నడుపుతున్నాడని మృతుడి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.

11న షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు

సత్తెనపల్లి: పట్టణంలోని వావిలాల గోపాలకృష్ణయ్య ఇండోర్ స్టేడియంలో నియోజకవర్గస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు ఈనెల 11న జరుగుతాయని నిర్వాహకులు బుధవారం తెలిపారు. పట్టణంలోని రఘురాంనగర్‌లో సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ బుధవారం టోర్నీ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లా డుతూ టోర్నీలో పాల్గొనదలిచిన ఔత్సాహిక క్రీడాకారులు ఈ నెల 10న సాయంత్రం 4 గంటల లోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ఎంట్రీ ఫీజు రూ. 300 చెల్లించాలన్నారు. పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన వారికి రూ. 15 వేలు, ద్వితీయ స్థానానికి రూ. 7,116, తృతీయ స్థానానికి రూ. 3,500, చతుర్ధ స్థానానికి రూ.1000 నగదు బహుమతులు అందించడం జరుగుతుందన్నారు. పూర్తి వివరాలకు 9985031617, 9059403333 నంబర్లలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దరువూరి నాగేశ్వరరావు, ఆళ్ల సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అమరావతి: మండలంలోని అన్ని గ్రామాలకు శుక్రవారం 33 కేవీ లైన్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ ఏఈ పి.రవికిరణ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటలవరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులందరూ సహకరించాలని కోరారు.

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

నకరికల్లు: సంక్రాంతి పర్వదినం పురస్కరించుకొని కోడిపందేలు, పేకాట నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ చల్లా సురేష్ బుధవారం హెచ్చరించారు. గతంలో కేసులు ఉన్న వారిని మండల మెజిస్ట్రేట్ వద్ద హాజరుపరచి రూ.2లక్షల నుంచి 3లక్షల వరకు బైండోవర్ చేయిస్తున్నట్లు తెలిపారు. అయినప్పటికీ నిబంధనలు అతిక్రమించి కోడిపందేలు నిర్వహిస్తే నగదు జప్తుచేయడంతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

అన్నార్తుల ఆకలితీర్చడం గొప్పవిషయం



పెదకూరపాడు: ఆకలితో ఉన్నవారి కడుపు నింపటం ఎంతో గొప్పవిషయమని జన చైతన్య సమితి కార్యదర్శి తుళ్లూరి సాంబశివరావు అన్నారు. పెదకూరపాడుకు చెందిన బాలినేని రామయ్య ఇంటివద్ద జరిగిన శుభకార్యాయంలో భోజనం మిగిలిన విషయాన్ని డాక్టర్ శ్రీనివాస్ జన చైతన్య సమితి వారికి చెప్పారు. సంస్థ ప్రతినిధులు వచ్చి ఆహారాన్ని సేకరించి స్థానిక ముగ్గురు రాజుల తిరునాల సందర్భంగా పలు ప్రాంతాల నుంచి వచ్చిన వారికి వడ్డించారు. కార్యక్రమంలో జన చైతన్య సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసరి విజయ్ బెన్నిబాబు, గుడిపూడి అఖిల్ తదితరులు ఉన్నారు.

తహసీల్దార్‌కు సత్కారం

అచ్చంపేట: సమస్యల పరిష్కారంలో సత్వర సేవలను అందిస్తున్న అచ్చంపేట తహసీల్దారు జి.శ్రీనివాసయాదవ్‌ను కొండూరు గ్రామస్తులు శాలువాలు, జ్ఞాపికలు, పూలమాలలతో సత్కరించారు. రెవెన్యూ సదస్సులో పాల్గొనేందుకు తహసీల్దారు కొండూరు వెళ్లగా గ్రామస్తులు సాదరంగా ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీలకతీతంగా సమస్యలు పరిష్కరించడంలో, సంక్షేమ పథకాలు అమలులో నిస్వార్థంగా పనిచేసే వారికి ప్రజల ఆదరణ ఉంటుందన్నారు. మాజీ సర్పంచ్ ఆలా బాగేశ్వరరావు, డీలరు వెంకటేశ్వర్లు, వీఆర్వో రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ హాస్టళ్లను మంజూరు చేయాలి

రాజుపాలెం: సీజనల్ హాస్టళ్లకు అనుమతులు మంజూరు చేయాలని నేషనల్ యాంటీ క్రైమ్ హ్యూమన్‌రైట్స్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఇన్‌చార్జి గరికపాటి శంకరరావు ప్రభుత్వాన్ని కోరారు. మండలంలోని కొండమోడులో గల వీరమ్మ కాలనీలోని హ్యూమన్‌రైట్స్ కార్యాలయంలో సభ్యుల సర్వసభ్య సమావేశం జిల్లా అధ్యక్షుడు కోనేటి నరసింహారావు అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ సమావేశంలో ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు, సాంఘిక సంక్షేమ శాఖ హాస్టళ్లలో మౌలిక వసతులు, మెడికల్ షాపుల నిర్వాహణలు సభ్యులందరు కలసి పరిశీలించి బాగోగులపై ప్రభుత్వ దృష్టికి తీసుకెళదామని తెలిపారు. సభ్యులు కోడిరెక్క కుమార్, కోట బాబూరావు, మస్తాన్‌రావు, కాకుమాను శ్రీనివాసరావు, జాలా వరప్రసాద్, జాన్‌బాబు పాల్గొన్నారు.

మహిళా పోలీస్ అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ



ముప్పాళ్ళ: పల్నాడు జిల్లా సచివాలయ మహిళా పోలీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎంపీడీఓ పీ.జే.విలియమ్స్ మంగళవారం ఆవిష్కరించారు. మహిళాపోలీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు దుర్గం మధులత, పల్నాడు జిల్లా అధ్యక్షురాలు దామర్ల నళిని, ఎగ్జిక్యూటివ్ మెంబర్ వి.బి.ఎల్.సరితాదేవి, మండలంలోని ఆయా గ్రామ సచివాలయ మహిళా పోలీసులు పాల్గొని క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

వృద్ధులకు ఆహార ప్యాకెట్లు పంపిణీ

సత్తెనపల్లి: పట్టణంలోని గీతామందిరం వద్ద పద్మశాలి బహోత్తమ సంఘ రాష్ట్ర కార్యదర్శి రంగా సురేష్ ప్రోద్బలంతో గుంటూరుకు చెందిన రాణి ఆర్థిక సహాయంతో 51 మంది నిరుపేదలు, వృద్ధులు, యాచకులకు భోజన ప్యాకెట్లు, పండ్లు, స్వీట్లు బుధవారం పంపిణీ చేశారు. సీనియర్ న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు, కుంచనపల్లి శ్రీనివాసరావు, నారాయణ నగర సంకీర్తన టీం సభ్యులు కూరపాటి విజయ శంకర్, తదితరులు ఉన్నారు.